
షాబాద్ మండలంలో జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలె యాదయ్యకు మద్దతుగా నిర్వహించిన బైకు ర్యాలీ(ఫైల్)


మొయినాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి కేటీఆర్(ఫైల్)


షాబాద్ మండలంలో బీఆర్ఎస్ ప్రచారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే అస్త్రంగా..

- చేవెళ్లలో కారు జోరు
- కేటీఆర్ రోడ్‌షోతో బీఆర్ఎస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం
- ప్రచారంలో దూసుకుపోతున్న గులాబీ పార్టీ
- బీఆర్ఎస్ అభ్యర్థి యాదయ్యకు ప్రజల బ్రహ్మరథం
- చేవెళ్లలో ఈ నెల 27న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు
- మూడోసారి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రజలు సిద్ధం

షాబాద్, నవంబర్ 19 : చేవెళ్లలో కారు పార్టీ జోరు మీదుంది. ఎన్నికల ప్రచారంలో గులాబీ పార్టీ దూసుకుపోతున్నది. అభివృద్ధి, సంక్షేమ పథకాలే అస్త్రంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాలె యాదయ్య పల్లెల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్నారు. గత తొమ్మిదన్నరేండ్ల కాలంలో చేవెళ్ల నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నారు. అప్పుడు ఎట్లుండె తెలంగాణ.. ఇప్పుడెట్లుంది తెలంగాణ అంటూ నిత్యం జనంతో మమేకమవుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. 2014కు ముందు చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఊహించని రీతిలో అభివృద్ధి చెందింది. హనుమంతుడి గుడి లేని ఊరు లేదు..సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదనే నినాదంతో ప్రజల్లోకి దూసుకువెళ్తున్నారు. గత నెల రోజుల నుంచి నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట్ మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 70 శాతం గ్రామాల్లో ప్రచారం పూర్తి చేసుకున్నారు. వారం రోజుల్లో అన్ని గ్రామాల్లో ప్రచారం విజయవంతంగా పూర్తి చేసేందుకు షెడ్యూల్ తయారు చేసుకుని ముందుకు సాగుతున్నారు.

## కేటీఆర్ రోడ్‌షోతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం

చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ రోడ్‌షోతో బీఆర్ఎస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఈ నెల 16న నియోజకవర్గ పరిధిలోని మొయినాబాద్ చౌరస్తాలో నిర్వహించిన కేటీఆర్ రోడ్‌షోకు ఐదు మండలాల నుంచి వేల సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలి రావడంతో రోడ్‌షో సక్సెస్ అయ్యింది. ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గం ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెందినట్లు, మూడోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని, మంచి వ్యక్తి, సీఎం కేసీఆర్‌కు అతి సన్నిహితుడు కాలె యాదయ్యను మరోసారి ఆశీర్వదించాలని కేటీఆర్ మాట్లాడటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. షాబాద్‌లో జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలె యాదయ్యకు మద్దతుగా 2వేల బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 27న చేవెళ్లలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఉంది. దానికి కూడా బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఎన్నికల ప్రచారంలో యాదయ్యకు విజయ తిలకం దిద్దుతున్న మహిళ

## ఇంటింటికీ ప్రభుత్వ పథకాల ప్రచారం

సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో అన్ని వర్గాల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలపై బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అమలు జరుగుతున్న పథకాలు ఆసరా పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి పథకాలతోపాటు కొత్తగా ఆరోగ్యరక్ష, సౌభాగ్యలక్ష్మి, రైతు బంధు పెంపు, పింఛన్లు పెంపు, గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు, అన్నపూర్ణ కార్డుదారులకు సన్న బియ్యం, రూ.15లక్షల బీమా వంటి పథకాలు అమలు చేయనున్నట్లు ప్రజలకు వివరిస్తున్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి రావాలని, అందుకు ప్రజలు మద్దతు తెలపాలని కోరుతున్నారు.


కారు గుర్తుకు ఓటేయాలని అవ్వను కోరుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

## ప్రచారానికి ప్రజల బ్రహ్మరథం

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా పెద్దఎత్తున బీఆర్ఎస్ అభ్యర్థికి ఘన స్వాగతం పలుకుతున్నారు. తామంతా బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉంటామని చెబుతున్నారు. రామక్క పాటకు బీఆర్ఎస్ శ్రేణులు, మహిళలతో పాటు ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా డ్యాన్సులు చేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. 30న జరిగే ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేసేందుకు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలు సిద్ధమవుతున్నారు.

---

# కారు జోరు.. ప్రతిపక్షాలు బేజారు

### మంచిరెడ్డి గెలుపు కోసం కుటుంబ సభ్యుల ప్రచారం
### ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి ముకుందమ్మ

ఇబ్రహీంపట్నం, నవంబర్ 19 : ఎన్నికల ప్రచారంలో ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో రోజురోజుకు కారు జోరు పెరుగుతున్నది. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపు కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతోపాటు ఆయన కుటుంబ సభ్యులు రంగంలోకి దిగారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఆదివారం ఎమ్మెల్యే సతీమణి ముకుందమ్మ, ఆయన కూతురు శీతల్, కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, కోడలు మౌనిక ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వారు ఇంటింటికీ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు ఎమ్మెల్యే చేసిన కృషిని ప్రజలకు క్షుణ్ణంగా వివరిస్తున్నారు. కిషన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఆడపడుచులకు బొట్టు పెడుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో భాగంగా డోర్ పోస్టర్లను అతికిస్తూ ఆకట్టుకుంటున్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కూడా యువతను చైతన్యపరుస్తున్నారు. బంటి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలోనూ యువకులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. అన్ని మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జోరుగా ప్రచారం నిర్వహిస్తూ బీఆర్ఎస్ గెలుపు కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారు. అభివృద్ధి చేసేవాళ్లకే ప్రజలు పట్టంగట్టాలన్నారు. ఐదేండ్లకోసారి ఎన్నికల ముందుకొచ్చి మాయమాటలు చెప్పే కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. మహిళా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే సీఎంగా కేసీఆర్ రావాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీ గెలిపించాలని వారు కోరారు. కారు జోరుతో ప్రతిపక్షాలు బేజారవుతున్నాయి.

# ముస్లిం మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట

### ఎన్నికల ప్రచార సభలో తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి

తాండూరు, నవంబర్ 19 : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ సర్కార్ పెద్దపీట వేస్తున్నదని బీఆర్ఎస్ అభ్యర్థి, తాండూరు సిట్టింగ్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రత్యేక ప్రచార (ముస్లిం ఆత్మీయ సమ్మేళనం) సభలో బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏ పని చేసుకున్నా ముస్లింలు ఆత్మగౌరవంతో జీవిస్తారన్నారు. గత ప్రభుత్వాలు మైనార్టీలను విస్మరించాయని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలను సీఎం కేసీఆర్ గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించారని తెలిపారు. ముస్లింలకు షాదీముబారక్ పథకం ప్రవేశపెట్టడంతోపాటు రంజాన్‌కు దుస్తుల పంపిణీ, మసీదులకు రూ.కోట్ల నిధులతో మరమ్మతులు చేయించామని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీలు ముస్లింల కోసం ఏమీ చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయరని స్పష్టం చేశారు. తాండూరు నియోజకవర్గంలోని మసీదులు, దర్గాలతో పాటు ఖబ్రస్తాన్‌ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. అవసరమున్న చోట మరిన్ని నిధులు ఇస్తామని ప్రకటించారు. అబద్ధాలు చెప్పే కాంగ్రెస్ మాటలు నమ్మరాదని సూచించారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముస్లిం పెద్దలు మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా ఎలాంటి సహాయం చేయలేదన్నారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే తమకు అన్ని విధాలుగా బాగుందన్నారు. బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా, రెండోసారి రోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


బీఆర్ఎస్ ప్రచార సభలో పాల్గొన్న ముస్లింలు